దళితబంధు రెండో విడత గ్రౌండింగ్ చేపట్టాలి

సుభాష్‌నగర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): దళితబంధు రెండో విడత గ్రౌండింగ్ ప్రక్రియను ప్రారంభించి నిధులు విడుదల చేయాలని దళితబంధు సాధన సమితి సభ్యులు కలెక్టర్‌ను కోరారు. సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజావాణిలో కలెక్టర్ పమేలా సత్పతికి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హుజూరాబాద్ నియోజకవర్గానికి చెందిన దళితబంధు రెండోవిడత లబ్ధిదారులకు నిధులు గ్రౌండింగ్ చేస్తున్నట్లు గత జనవరిన ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు ఇచ్చినట్లు తెలిపారు. ఇప్పటికైనా పూర్తి స్థాయిలో గ్రౌండింగ్ ప్రారంభించాలని కోరారు.

కన్నుల పండువగా రామయ్యకు పట్టాభిషేకం

పట్టు వస్త్రాలు సమర్పించిన కేంద్ర మంత్రి బండి సంజయ్




ఇల్లందకుంటలో సీతారామచంద్రస్వామి పట్టాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు, పట్టువస్త్రాలు తీసుకువస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్

ఇల్లందకుంట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట సీతారామచంద్రస్వామి దేవాలయంలో జరిగే బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం మధ్యాహ్నం 12:10గంటలకు రామయ్యకు కన్నుల పండువగా పట్టాభిషేక కార్యక్రమం నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజల అనంతరం వేదబ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య రాములోరి పట్టాభిషేక కార్యక్రమం జరిపించారు. ఈ సందర్భంగా కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ రామయ్యకు పట్టు వస్త్రాలు సమర్పించి, పట్టాభిషేకం కార్యక్రమాన్ని తిలకించారు. అనంతరం స్వర్ణ పుష్పార్చన కార్యక్రమం జరిపించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ మాట్లాడుతూ సీతారాముల ఆశీస్సులతో తెలంగాణ రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలన్నారు. రామయ్య పట్టాభిషేకంలో పాల్గొనడం ఆనందంగా ఉందని అన్నారు. అంతకు ముందు ఆలయ అర్చకులు శేషం వంశీధరాచార్యులు, ఈవో సుధాకర్‌లు కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. ఆయన వెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మండలాధ్యక్షుడు బైరెడ్డి రమణారెడ్డి, కటంగూరి అనిల్‌రెడ్డి, ఎర్రబెల్లి సంపత్‌రావు, సంపెల్లి సంపత్‌రావు, శీలం శ్రీనివాస్, పవన్ రెడ్డి, బండ రవి, జీడీ మల్లేష్ పాల్గొన్నారు.

ఘనంగా హంసవాహన సేవ

ప్రభుత్వోత్సవం అనంతరం రాత్రి వేళ హంసవాహన సేవ ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులను అలంకరించి హంస వాహనంపై అధిరోహింపజేశారు. బాజాభజంత్రీలు,మంగళవాయిద్యాలు, హనుమాన్ భక్తుల రామనామస్మరణ మధ్య ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు.



హంసవాహనసేవలో స్వామివారి ఊరేగింపు

నిరుద్యోగులకు అండగా రాజీవ్ యువ వికాసం



- ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులకు అవకాశం
- ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల్లో హెల్ప్‌డెస్క్‌లు
- ఈనెల 14 వరకు దరఖాస్తుల స్వీకరణ
- అందుబాటులో దరఖాస్తు ఫారాలు
- ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులు 34,978

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

రాజీవ్ యువ వికాసం పథకం కింద ఆర్థిక సహాయం పొందేందుకు ఈ నెల 14వరకు దరఖాస్తు చేసుకునేందుకు గడువు పొడిగించిన ప్రభుత్వం ఇక నుంచి మీసేవ కేంద్రాల్లోనే కాకుండా ఆఫ్‌లైన్‌లో మున్సిపల్, ఎంపీడీవో కార్యాలయాల్లో కూడా నేరుగా దరఖాస్తులు ఇచ్చేందుకు అవకాశం కల్పించింది. ఆయా కార్యాలయాల్లో దరఖాస్తులను అందుబాటులో ఉంచడమే కాకుండా హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేసి ప్రత్యేక సిబ్బందిని కూడా నియమించింది. ఈ పథకం కింద ఆర్థిక సహాయం పొందేందుకు ఈ నెల 5వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. అయితే ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవడంలో తరచూ ఇబ్బందులు ఎదురై సర్వర్ డౌన్ కావడం, సాంకేతిక సమస్యలు తలెత్తడంతో మీసేవ కేంద్రాల్లో దరఖాస్తుదారులు గంటలు, రోజులతరబడి వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఈ కారణంగా చాలా మంది దరఖాస్తు చేసుకోలేక పోయారు. పరిస్థితిని గమనించిన ప్రభుత్వం ఈనెల 14వరకు దరఖాస్తులు చేసుకోవడానికి గడువు పెంచడమేకాకుండా ఆఫ్‌లైన్‌లో ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల్లో దరఖాస్తులు చేసుకునేందుకు ఏర్పాట్లు చేసింది. ఇందుకోసం ఆఫ్‌లైన్ దరఖాస్తులను రూపొందించిన ప్రభుత్వం 27 కాలమ్స్‌లో దరఖాస్తుదారులు వివరాలను నమోదు చేయాలని సూచించింది. ఆధార్‌కార్డు, ఆహారభద్రత కార్డు లేదా ఆదాయ ధ్రువీకరణ పత్రం, కులధ్రువీకరణ పత్రం, దివ్యాంగులైతే సదరం ధ్రువపత్రాన్ని జతపరచాలని సూచించింది. ఆఫ్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులన్నిటినీ పరిశీలించి వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు.

● రూ. 4లక్షల వరకు ఆర్థికసాయం

రాజీవ్ యువ వికాసం పథకం కింద 50వేల నుంచి 4 లక్షల రూపాయల వరకు ఆర్థిక సహాయం పొందవచ్చు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల యువతీయువకులు స్వయం ఉపాధి కల్పించేందుకు వివిధ రకాల యూనిట్లు నెలకొల్పేందుకు ఈ ఆర్థిక సహాయం అందిస్తారు. 50వేల రూపాయల విలువ చేసే యూనిట్‌కు వందశాతం సబ్సిడీ ఇస్తారు. 50వేల పైబడి లక్ష రూపాయల వరకు 90శాతం సబ్సిడీ లభిస్తుంది. లక్ష నుంచి 2 లక్షల రూపాయల వరకు యూనిట్లకు 80శాతం సబ్సిడీ, 2 లక్షలకు పైబడి 4 లక్షల రూపాయల యూనిట్ల వరకు 70శాతం సబ్సిడీని ప్రభుత్వం సమకూర్చుతుంది. సబ్సిడీ పోను మిగతా సొమ్మును లబ్ధిదారులు సమకూర్చుకోవలసి ఉంటుంది. ఇప్పటి వరకు జిల్లాలో ఈ పథకం కింద అన్ని రకాల కేటగిరీల కింద 34,978 దరఖాస్తులు వచ్చాయి. బీసీ సంక్షేమశాఖ ద్వారా 24,200 మంది బీసీ యువతీ యువకులు, ఎస్సీ సంక్షేమశాఖ ద్వారా 7,700 మంది యువతీయువకులు, 629 మంది ఎస్టీలు, 2400 మంది మైనార్టీలు, 49 మంది క్రిస్టియన్లు ఆర్థిక సహాయం కోరుతూ దరఖాస్తు చేసుకున్నారు. ఆఫ్‌లైన్ దరఖాస్తు ఫారాలను సంబంధిత కార్యాలయాలకు కూడా వెళ్లాల్సిన అవసరం లేకుండానే వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొని నిర్ణీత ఫారాన్ని పూరించిన తర్వాత అడిగిన సర్టిఫికెట్లను జతపరిచి ఆయా కార్యాలయాల్లో అందజేస్తే సరిపోతుంది. tgobasnew.cgg.gov.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి అప్లికేషన్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.



మారిన జీవనశైలితోనే అనారోగ్యం

● శారీరక శ్రమ లేక ఇబ్బందులు ● ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ ఎనమల్ల నరేష్

సుభాష్‌నగర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మారిన జీవనశైలి, శారీరక శ్రమ లేకపోవడంతో అనారోగ్యం పాలవుతున్నారని పలువురు డాక్టర్లు తెలిపారు. సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా కరీంనగర్ ఐఎంఏ హాలులో ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ ఎనమల్ల నరేష్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఏప్రిల్ 7న ప్రపంచ ఆరోగ్య దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పలు ఆరోగ్య సలహాలు అందించారు. ముఖ్యంగా కన్వర్టబుల్ డిసీజెస్ అంటే బీపీ, షుగర్, గుండె వ్యాధులు, క్యాన్సర్ వంటి జబ్బులు, మానసిక వ్యాధులు రోజురోజుకు పెరుగుతున్నాయన్నారు. అందుకు కారణం మారుతున్న జీవనశైలి, ఆహారపు అని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ ఎనమల్ల నరేష్

గైనకాలజీ వైద్యురాలు డాక్టర్ మాధవి మాట్లాడుతూ గర్భిణీలు డాక్టర్ల సలహాలు, సూచనలు పాటిస్తూ మందులతో పాటు ఆహారం, శారీరక శ్రమ కూడా అవసరం అన్నారు. చిన్న పిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ రామ్మోహన్ మాట్లాడుతూ తక్కువ బరువుతో పుట్టడం, జన్యు లోపం ఇతర అనారోగ్య సమస్యల వల్ల శిశువులు చనిపోతున్నారని తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మలమూత్ర విసర్జన చాలా వరకు తగ్గిపోవడంతో పిల్లల్లో వచ్చే చాలా జబ్బులు తగ్గిపోయాయని తెలిపారు. ప్రముఖ డాక్టర్ విజయ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ మహిళలు గర్భం దాల్చిన తర్వాత శారీరక శ్రమ తగ్గిందన్నారు. దీంతో సాధారణ కాన్పులు అయ్యే పరిస్థితి తక్కువగా ఉందన్నారు. ప్రముఖ సీనియర్ ఫిజీషియన్ డాక్టర్ రఘురామన్ మాట్లాడుతూ పిల్లలు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను చూస్తూ పెరుగుతారని, వారు ఎలా ప్రవర్తిస్తే వీరు అలాగే తయార వుతారని అన్నారు. పిజ్జా, బర్గర్లు తిన్నవారే చాలా గొప్ప వాళ్లు అనే అపోహ సమాజంలో ఉందన్నారు. రోజువారి ఆహారంలో చక్కెర, ఉప్పు, మైదాకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం పలువురు డాక్టర్లు రక్తదానం చేశారు. ఈ సమావేశంలో ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ నవీన్‌కుమార్, కోశాధికారి డాక్టర్ విజయ్‌కుమార్, డాక్టర్ ఆర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ ఉష, డాక్టర్ చైతన్య, తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

20 నుంచి ఎస్సెస్సీ, ఇంటర్ పరీక్షలు

అధికారులతో కలెక్టర్ సమీక్ష

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఓపెన్ స్కూల్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. ఈ నెల 20 నుంచి ప్రారంభం కానున్న ఓపెన్ స్కూల్ ఎస్సెస్సీ, ఇంటర్ పరీక్షల నిర్వహణపై కలెక్టర్ పమేలా సత్పతి సమీక్ష నిర్వహించారు. జిల్లాలో 421 మంది పదో తరగతి, 881 మంది ఇంటర్మీడియట్ ఓపెన్ స్కూల్ పరీక్షకు హాజరుకానున్నారు. పది పరీక్షలకు మూడు పరీక్షా కేంద్రాలు, ఇంటర్మీడియట్ పరీక్షలకు నాలుగు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు.

వేసవి తీవ్రత అధికంగా ఉండడంతో పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఇబ్బంది పడకుండా పరీక్షా కేంద్రాల్లో మంచినీటి వసతి, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచడంతో పాటు మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పరీక్షల నిర్వహణపై కలెక్టర్ అధికారులతో మాట్లాడారు. ప్రశ్నపత్రాలను, కేంద్రాలకు తరలించే సమయంలో కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు చేయాలని సూచించారు. పరీక్షా సమయంలో విద్యార్థులు మినహా ఇతరులెవరినీ అనుమతించరాదని, పకడ్బందీగా, ప్రశాంతంగా పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్‌ను నియమించాలని, అవసరమైన చోట మహిళా పోలీసులకు డ్యూటీ కేటాయించాలని అన్నారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్నిశాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ సిహెచ్. నాగేశ్వర్‌రావు, జిల్లా విద్యాధికారి జనార్ధన్‌రావు, జిల్లా సైన్స్ అధికారి జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజావాణి సమస్యలను పరిష్కరించాలి

సుభాష్‌నగర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణికి వచ్చే దరఖాస్తులను అధిక ప్రాధాన్యం ఇచ్చి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పమేలాసత్పతి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలు స్థానికంగా పరిష్కారం కాకపోవడంతో ప్రజావాణికి వస్తుంటారని తెలిపారు. వాటిని పెండింగ్‌లో ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలన్నారు. అలాగే పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను కూడా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణికి మొత్తం 246 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. అదనపు కలెక్టర్లు లక్ష్మికిరణ్, ప్రఫుల్ దేశాయ్, డీఆర్‌వో వెంకటేశ్వర్లు, ఆర్‌డీవో మహేశ్వర్, డీటీడీవో పవన్ కుమార్, కలెక్టరేట్ ఏవో సుధాకర్ అధికారులు పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ పమేలాసత్పతి

ఆస్తిపన్నుల టార్గెట్ పూర్తి చేయాలి

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సంవత్సరం ఆస్తి పన్నులో వన్ టైం సెటిల్మెంట్ 5శాతం రిబేట్‌ను 50శాతం టార్గెట్ ఏప్రిల్‌లో పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. కరీంనగర్ నగర పాలక సంస్థ కళాభారతిలో రెవెన్యూ విభాగం అధికారులు, వార్డు ఆఫీసర్లు, సపోర్టింగ్ ఉద్యోగులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఆస్తి పన్నుల వసూళ్లు, ట్రేడ్ లైసెన్స్‌ల వసూళ్లు, అసెస్మెంట్లు తదితర అంశాలపై చర్చించారు. 2024-25 ఆర్థిక సంవత్సరం 15వ ఫైనాన్స్ టార్గెట్ రీచ్ అయినందుకు కమిషనర్ అధికారులను అభినందించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ సువార్త, డిప్యూటీ కమిషనర్ స్వరూపరాణీ, ఆర్వో భూమానందం, ఆర్ఐలు విజయలక్ష్మి, కిష్టయ్య, వార్డు ఆఫీసర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ చాహత్‌బాజ్‌పాయ్

విలీన గ్రామాల్లో మంచినీటి కటకట



మహబూబ్ కాలనీలో ప్రైవేట్ ట్యాంకర్‌తో నీటి సరఫరా

నల్లా నీటి కోసం ఇబ్బందులు

ప్రైవేట్ ట్యాంకర్లతో నీటి కొనుగోలు

మౌలిక సదుపాయాలూ కరువే

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థలో తమ గ్రామాలను విలీనం చేస్తే సమస్యలు తీరడమే కాకుండా కాలనీలు అభివృద్ధి చెందుతాయని భావించిన విలీన గ్రామల ప్రజల ఆశలు అడియా శలయ్యాయి. ఐదేళ్ల క్రితం బీఆర్ఎస్ ప్రభుత్వం నగరపాలక సంస్థకు చేరువలోని పద్మనగర్, రేకుర్తి, సీతారాం పూర్, ఆరెపల్లి, తీగలగుట్టపల్లి, వల్లంపహాడ్, సదాశివపల్లి, అల్గునూర్ గ్రామాలను కరీంనగర్ కార్పొరేషన్‌లో విలీనం చేస్తూ డివిజన్ల సంఖ్యను 60కి పెంచింది. ఐదేళ్ల క్రితం కార్పొరేషన్‌లో విలీనమైన గ్రామాల్లో పంచాయతీ బోర్డు మారి కరీంనగర్ కార్పొరేషన్ బోర్డుగా మార్చారు తప్ప గ్రామ పంచాయతీ కంటే ఎక్కువ సౌకర్యాలు కల్పించలేదని, మున్సిపల్‌లో విలీనం చేయడంతో పన్నుల భారమే తప్పా ఒరిగిందేమి లేదని ఆయా గ్రామాల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటికీ విలీన గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీలు, వీధిదీపాలు వంటి మౌలిక సదుపాయాలు పూర్తిగా కల్పించలేదు. ఐదేళ్ల నుంచి విలీన డివిజన్ల ప్రజలు అభివృద్ధి జరుగుతుందని ఆశతో ఎదురు చూస్తున్నారు. 2025 జనవరి 28తో పాలకవర్గ ఐదేళ్ల పదవీకాలం ముగిసిందేకానీ వారి సమస్యలు మాత్రం పరిష్కారానికి నోచుకోలేదు. మున్సిపాలిటీతో సర్టిఫికేట్ల కోసం, ఇతర సౌకర్యాల కోసం కార్యాలయాలు చుట్టూ తిరుగాల్సి వస్తోందంటూ విమర్శి స్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చిన తర్వాత గత బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన సీఎం హామీ నిధులు, పట్టణ ప్రగతి నిధులు పూర్తిగా నిలిపివేయడమే కాకుండా కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులను చెల్లించడం లేదు. దీనితో అభివృద్ధి పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి.

అడుగంటుతున్న భూగర్భ జలాలు

అభివృద్ధి జరుగడం లేదంటూ ఓవైపు విలీన గ్రామాల ప్రజలు ఆవేదన చెందుతుండగా కాంగ్రెస్ సర్కార్ చింతకుంట, మల్కాపూర్, లక్ష్మీపూర్, బొమ్మకల్, గోపాల్‌పూర్ గ్రామాలతో పాటు కొత్తపల్లి మున్సిపాలిటీని కూడా కరీంనగర్ కార్పొరేషన్‌లో విలీనం చేసింది. డివిజన్ల సంఖ్యను 60 నుంచి 66కు పెంచి పంచాయతీ కార్యాల యాలను వార్డు కార్యాలయాలుగా మార్చి ఆయా గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బందిని కార్పొరేషన్‌కు బదిలీ చేస్తూ ఆస్తులను సీజ్ చేసి కార్పొరేషన్‌కు స్వాధీనం చేసింది. దీనితో కొత్తగా విలీనం అయిన గ్రామాల ప్రజలకు కూడా కష్టాలు మొదలయ్యాయి.

అప్పటి వరకు సిటీకి దగ్గరగా ఉండడంతో భూముల విలువల ఎక్కువగా ఉండి గ్రామపంచాయతీలకు ఆదాయం సమకూరేది. వాటితో ఆయా గ్రామాల్లో మౌలిక వసతులను కల్పించేవారు. ఇప్పుడు ఆ గ్రామాల పరిస్థితి మారింది. అక్కడ వచ్చే ఆదాయా న్ని కూడా కార్పొరేషన్‌లో విలీనం చేస్తున్నారేగానీ అభివృద్ధి, సౌకర్యాలు మాత్రం కల్పించడం లేదని ఆవేదన చెందుతున్నారు. అమృత్-2 పథకం కింద మంజూరైన నిధులతో మొదటి విడత విలీనమైన గ్రామాల్లో మంచినీటి పనులను చేపడుతున్నప్పటికీ ఆ పనులు నత్తనడక సాగడంతో ఆయా గ్రామాల్లో నీటి తిప్పలు మొదలయ్యాయి. మరోవైపు కొత్తగా విలీనమైన గ్రామాల్లో భూగర్భ జలాలు అడుగంటి తాగునీటికే కాకుండా ఇతర అవసరాలకు కూడా వినియోగించుకునేందుకు బోరుబావుల నుంచి నీరు రావడం లేదని, అద్దె ట్రాక్టర్లతో అవసరాలను తీర్చుకుంటు న్నామని ప్రజలు చెపుతున్నారు.

మానేరు డ్యామ్‌కు అతిచేరువలోని బొమ్మకల్ గ్రామపరిధిలోని మహబూబ్ కాలనీలో మంచి నీటి పైపులైన్లు వేసి ట్రయల్ రన్ చేశారే కానీ నల్లానీటిని మాత్రం విడుదల చేయడం లేదు. దీనితో ఆ కాలనీలోని ప్రజలు తాగునీటికి, ఇతర అవసరాల కోసం ప్రైవేట్ ట్యాంకర్లతో నీటిని కొనుగోలు చేసి తెప్పించుకుంటున్నారు. ఒక్క ట్యాంకర్‌కు రూ.600 నుంచి 700 తీసుకుంటున్నారని, తాగేందుకు కూడా మంచినీటిని ఇవ్వక పోవడం దారుణమని కాలనీవాసులు అంటున్నారు. నల్లాల ద్వారా నీటిని ఇవ్వకుంటే కనీసం ట్యాంకర్ల ద్వారానైనా తమ కాలనీకి తాగునీటిని అందించాలని కాలనీవాసులు కోరుతున్నారు. అలాగే విలీన గ్రామాల్లోని అనేక కాలనీల్లో ఇదే పరిస్థితి ఉండడంతో ప్రైవేట్ ట్యాంకర్లతో నీటిని కొనుగోలు చేస్తున్నారు. ఏప్రిల్ మొదటి వారంలోనే ఈ పరిస్థితి ఉంటే ఇక రెండు నెలలు ఏప్రిల్ పూర్తిగా, మే, జూన్ మొదటి వరకు ఎలా అని విలీన గ్రామాల ప్రజలు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు.

గోదావరిలో దూకి వ్యక్తి ఆత్మహత్య



నీటిలో హషాం అహ్మద్ మృతదేహం

ధర్మపురి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని రాయపట్నం గోదావరినదిలో దూకి హషాం అహ్మద్(45) అనేవ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ ఉదయ్‌కుమార్ తెలిపారు. మంచిర్యాలజిల్లా మందమర్రి పట్టణానికి చెందిన హషాం అహ్మద్ కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతోబాధపడుతుండేవాడని ఆయన పేర్కొన్నారు. ఉదయం రాయపట్నం గోదావరి నదిలో మృతదేహం కనిపించడంతో సమాచారం అందించామన్నారు. మందమర్రిపట్టణానికి చెందిన మహ్మద్‌అలీ అహ్మద్ అనే వ్యక్తివచ్చి మృతుడు తనకొడుకు హషాంఅహ్మద్ అని గుర్తించాడన్నారు. హషాం అహ్మద్ ఫైనాన్స్ విషయమై రాయపట్నం గోదావరి నదిలోదూకి ఆత్మహత్య చేసుకున్నాడని అతడి తండ్రి ఫిర్యాదు చేయగా కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పురుగుల మందు తాగి బలవన్మరణం

జూలపల్లి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): అల్లారుముద్దుగా పెంచుకున్న కూతురు కులాంతర వివాహం చేసుకోవడంతో అప్పటినుంచి మనస్తాపంతో ఉన్న తండ్రి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. మండల కేంద్రానికి చెందిన ఎండి అజ్గర్‌పాష(43)కు ఇద్దరు కూతుళ్ళు పెద్ద కూతురుకు వివాహమైంది. రెండోకూతురు గతనెలలో అదే గ్రామానికి చెందిన యువకుడితో కులాంతర వివాహం చేసుకుంది. అప్పటినుంచి కూతురు తనను మోసం చేసిందని అజ్గర్‌పాష బాధ పడుతుండేవాడు. ఈక్రమంలో మనస్తాపంతో ఆదివారం పొలం వద్ద పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకిచేరాడు. గమనించిన చుట్టుపక్కల వారు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వెంటనే కుటుంబసభ్యులు వైద్యంకోసం కరీం నగర్‌కు, అనంతరం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు.మృతుడిభార్య ఫిర్యాదు మేరకు కేసుదర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సనత్‌కుమార్ పేర్కొన్నారు.

గోపాలమిత్రల గోడు పట్టేదెవరికి?

● 25 ఏళ్లుగా వెట్టిచాకిరి ● క్రమబద్ధీకరణకుకు నోచుకోని వైనం



గేదెకు కృత్రిమ గర్భధారణ చేస్తున్న గోపాలమిత్ర

కథలాపూర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పశువుల ఆరోగ్యం, అధిక పాలనిచ్చే ఆవులు, గేదెల సంతతిని పెంచడంలో ప్రధాన పాత్ర పోషిస్తున్న గోపాలమిత్రల గోడు వినేవారే కరవయ్యారు. 25 ఏళ్ల నుంచి వెట్టి చాకిరి చేస్తున్న గోపాలమిత్రులు నామమాత్రపు గౌరవ వేతనంతో పల్లెల్లో పనిచేస్తున్నారు. పశు సంవర్ధక శాఖ గత 2000-2001 సంవత్సరంలో ఉమ్మడి రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల్లో పశు సంపద పెంచడానికి శిక్షణ ఇచ్చి గోపాలమిత్రలను నియమించారు. నేటికీ నామమాత్రపు గౌరవ వేతనంతోనే పని చేస్తుండగా రిటైర్‌మెంట్ వయసు వచ్చినా రెగ్యులరైజేషన్‌కు నోచుకోవడం లేదు.

ప్రభుత్వాలు మారినా నెరవేరని హామీలు

అధిక పాల దిగుబడులను ఇచ్చే ముర్రా జాతి గేదెలు, జెర్సీ, పుంగనూరు, సాయివాల్, ఒంగోలు గిత్తల సంతతిని పెంచడానికి కృత్రిమ గర్భధారణ చేయడంలో కీలక భూమిక పోషించడానికి గోపాలమిత్రలను నియమించారు. ప్రస్తుతం ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 150 మంది గోపాలమిత్రులు పనిచేస్తున్నారు. పల్లెల్లో తిరుగుతూ రైతులను చైతన్యవంతం చేసి పశువులకు కృత్రిమ గర్భధారణ చేసి సంతతిని పెంచడంతో పాటు వైద్య సిబ్బందికి వివిధ రకాల పనుల్లో సహకరిస్తున్నారు. వ్యాక్సినేషన్, డీవార్మింగ్ వంటి కార్యక్రమాల్లో కూడా గోపాలమిత్రల సేవలను వినియోగించుకుంటున్నారు. ప్రతీ నెలా 120 కృత్రిమ గర్భధారణ కేసులు విధిగా చేయాల్సి ఉంటుంది. ఒక్కో స్ట్రాకు రూ.40లు చెల్లించి లిక్విడ్ నైట్రోజన్‌తో నింపిన కంటైనర్‌లో మైనస్ 0.90 డిగ్రీల ఉష్ణోగ్రతలో భద్రపరచాల్సి ఉంటుంది. పశువులు ఎదకొచ్చిన సమయాన్ని గుర్తించి మేలు రకం జాతి వీర్యాన్ని రైతు ముంగిటే కృత్రిమ గర్భధారణ చేస్తుంటారు. రైతులు ఇచ్చే పారితోషికంపైనే జీవనం కొనసాగించాల్సిన దుస్థితి ఉంది. గతంలో పాలకులు రెగ్యులరైజ్ చేసి ఆఫీస్ సబార్డినేట్లుగా నియమిస్తామని ఇచ్చిన హామీలు నీటి మూటలుగానే మిగిలి పోయాయని ఆవేదన వెలిబుచ్చుతున్నారు. 25 ఏళ్ల అనుభవంతో పని చేస్తున్న గోపాలమిత్రలను పశు వైద్యశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టుల్లో విద్యార్హతల ఆధారంగా నియమిస్తారని ఆశతో ఎదురుచూశారు. ఇటీవల శాఖతో సంబంధం లేని వారిని ఆఫీస్ సబార్డినేట్లుగా నియమించారని గోపాలమిత్రులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



కథలాపూర్ పశువైద్య కేంద్రం

ఆశలు ఆవిరి చేశారు.. చెన్నవేని దశరథం, ఉమ్మడి జిల్లా గోపాలమిత్ర సంఘం గౌరవాధ్యక్షుడు



గోపాలమిత్రగా 25 ఏళ్లుగా పనిచేస్తున్నాం. పాలకులు తమను రెగ్యులరైజ్ చేస్తారని నమ్మి పల్లెల్లో తిరిగి పశు సంపద పెంపు కోసం శ్రమించాం. గ్రామాల్లో శిబిరాలు, డీవార్మింగ్, వ్యాక్సినేషన్, కృత్రిమ గర్భధారణ వంటి కీలక పనులు నిర్వహిస్తున్నాం. తెలంగాణ ఏర్పడ్డాక తమ జీవితాలు మారిపోతాయని ఆశించినా భంగపాటు తప్పలేదు. ఇప్పటికైనా ఖాళీగా ఉన్న పశువైద్య కేంద్రాల్లో విద్యార్హతల ఆధారంగా ఆఫీస్ సబార్డినేట్లుగా నియమించి గోపాలమిత్ర కుటుంబాలను ఆదుకోవాలి.

తామర పురుగు నివారణతోనే మామిడి దిగుబడులు

● తెలంగాణ ఉద్యానవన విశ్వవిద్యాలయ శాస్త్రవేత్త డాక్టర్ లక్ష్మణ్

జగిత్యాల అగ్రికల్చర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం సీజన్‌లో మామిడిలో తామర పురుగు ఉధృతిని నివారిస్తేనే అధిక దిగుబడులు సాధ్యం అవుతాయని కొండాలక్ష్మణ్ బాపూజీ తెలంగాణ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ డాక్టర్‌లక్ష్మణ్ అన్నారు. జగిత్యాల జిల్లాలోని వివిధగ్రామాల్లో గల మామిడి తోటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం మామిడికాయ వృద్ధిచెంది, టెంకె గట్టిపడే దశలో ఉందన్నారు. పలుతోటలలో తామర పురుగు ఉధృతిని గమనించామని, సాధారణంగా మామిడి తోటలో తేనె మంచుపురుగు పూత, పిందదశలో నష్టాన్ని కలుగజేస్తుందని, అయితే తేనె మంచు పురుగు అదుపులో ఉన్నప్పటికీ తామర పురుగు ప్రభావం వల్ల పిందెలు రాలడం, మంగు ఏర్పడి కాయను పనిరాకుండా చేస్తుందన్నారు. నివారణ చర్యగా పురుగు ఉధృతిని బట్టి,ముందుగా వేపనూనె 3మి.లీ ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని, తర్వాత ఫిప్రోనిల్ 80శాతం డబ్ల్యూజి0.2గ్రా,లేదా స్పైనోసాడ్ 45శాతం ఎస్‌సి 0.3మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. సింథటిక్ పైరిథ్రాయిడ్ కీటక నాశనినులను ఈ సమయంలో వాడరాదని సూచించారు. ఆయనవెంట కృషివిజ్ఞాన కేంద్రం రామగిరిఖిల్లా శాస్త్రవేత్త డా.వెంకన్న, ఫామ్‌మేనేజర్ బండారి నరేష్, ఫల పరిశోధన స్థానం సంగారెడ్డి శాస్త్రవేత్త సతీష్, ఉద్యాన అధికారి మహేష్‌తో పాటు మామిడి రైతులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఎక్సైజ్ దాడులు

గంభీరావుపేట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మండలం ముచ్చర్ల, లింగన్నపేట తండాల్లో సోమవారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. నాటుసారా తయారుచేస్తున్నారన్న పక్కా సమాచారం మేరకు ఎక్సైజ్ అధికారులు సోదాలు చేపట్టారు. ఈ సోదాల్లో 300 లీటర్ల బెల్లం పానకం, 12 లీటర్ల నాటుసారా లభ్యం అయ్యింది. బెల్లం పానకం, నాటుసారాను స్వాధీనం చేసుకుని బాధ్యులైన ఇద్దరిపై కేసు నమోదు చేశామని సీఐ శ్రీనివాస్ తెలిపారు. అదేవిధంగా గుడంబా తయారుచేసే ఇద్దరు అనుమానితులను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో డీటీఎఫ్ ఎస్ఐ శైలజ, సిబ్బంది కిషోర్, మల్లేశ్వర్మ, రాకేష్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.



బెల్లం పానకాన్ని పారబోస్తున్న ఎక్సైజ్ అధికారులు

మహిళను వేధించి హత్య చేసిన నిందితుడికి జీవిత ఖైదు

జగిత్యాల క్రైం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మహిళను లైంగికంగా వేధించి ఒంటిపై కిరోసిన్ పోసి నిప్పంటించి హత్యకు పాల్పడిన వ్యక్తికి జీవిత ఖైదుతో పాటు రూ.1.02 లక్షల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ సోమవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం కొడిమ్యాల పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన ఓ వివాహితను అదే గ్రామానికి చెందిన ఇల్లంతకుంట శ్రీధర్ (28) అనే యువకుడు తరచూ లైంగికంగా వేధిస్తూ ఉండేవాడు. 2019 ఏప్రిల్14న వివాహిత ఒంటరిగా ఇంటి వద్ద ఉన్న సమయంలో శ్రీధర్ ఇంట్లోకి ప్రవేశించి లైంగిక కోరిక తీర్చమని వేధించడంతో పాటు చంపుతానని బెదిరించాడు. మహిళ తిరగబడడంతో ఒంటిపై కిరోసిన్ పోసి నిప్పంటించాడు. తీవ్రంగా గాయపడిన మహిళ రెండు రోజుల అనంతరం చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అప్పటి సీఐలు నాగేందర్, కిషోర్‌లు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఎంఎస్ ఎస్సై శ్రీకాంత్, కోర్టు డ్యూటీ అధికారులు సాగర్, కిరణ్, రాజులు సరైన సాక్ష్యులను కోర్టులో ప్రవేశ పెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ మల్లిఖార్జున్ కేసు వాదించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయి శ్రీధర్‌కు జీవిత ఖైదు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు.

చికిత్స పొందుతూ డిగ్రీ విద్యార్థి మృతి



అవేజ్(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): గతనెల 30న రోడ్డు ప్రమాదంలోగాయపడిన ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లోని డిగ్రీ విద్యార్థి షేక్ అవేజ్(20) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం వేకువజామున మృతిచెందాడని పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపారు. పోలీసులు,కుటుంబ సభ్యుల కథనం మేరకు.. గ్రామంలోని జైబుల్-సమ్మద్ దంపతుల ఒక్కాగానొక్క కొడుకు అవేజ్ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్నాడు. రంజాన్ పండుగ నేపథ్యంలో గతనెల 28న స్వగ్రామానికి వచ్చాడు. అదేనెల 30న సమీప బంధువైన యువకుడు అఫ్రోజ్‌తో కలిసి స్కూటీపై నూతన దుస్తులు కొనుగోలు చేసేందుకు సిరిసిల్ల బయలుదేరారు. మండలంలోని హరిదాస్‌నగర్ గ్రామ శివారులోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై ఎదురుగా వస్తున్న ఆటో అతి వేగంగా స్కూటీని ఢీకొట్టింది. దాంతో విద్యార్థులు అవేజ్, అఫ్రోజ్‌లు తీవ్ర గాయాలపాలయ్యారు. పరిస్థితి విషమంగా మారడంతో హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రులకు తరలించారు. వారం రోజులుగా చికిత్స పొందుతున్న అవేజ్ పరిస్థితి చివరికీ మృతిచెందాడు. మృతదేహం ఇల్లు చేరడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, బంధువుల రోధనలు మిన్నంటాయి. కేసు దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి



రమేష్ (ఫైల్)

వెల్గటూర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ మండలం స్తంభంపల్లి గ్రామానికి చెందిన జక్కులరమేష్(41) సోమవారం చికిత్సపొందుతూ మృతిచెందాడు. ఎస్సై ఉమసాగర్ తెలిపిన వివరాల ప్రకారం రమేష్ కొన్ని సంవత్సరాలుగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది ఈనెల 4న క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబీకులు జగిత్యాల ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందాడు. మృతుని భార్య జక్కుల వనిత ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వీడని 'విదేశీ బంగారం' చిక్కుముడి

● గల్ఫ్ పారిపోయిన నిందితుడు?

వేములవాడ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : సౌదీ అరేబియా నుంచి తీసుకు వస్తుండగా గమ్యస్థానం చేరకముందే మార్గమధ్యలోనే సినీ ఫక్కీలో మాయమైన విదేశీ బంగారం కేసు చిక్కుముడి వీడడం లేదు. జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండల కేంద్రానికి చెందిన రుద్ర రాంప్రసాద్ తన సమీప బంధువు సహకారంతో వేములవాడకు చెందిన కాల్వ వెంకటేష్ అనే వ్యక్తి ద్వారా బంగారం తెప్పించుకోవడం కోసం డబ్బులు పంపించారు. ఈ మేరకు చందుర్తి మండలం జోగాపూర్ గ్రామానికి చెందిన బీరయ్య, అనిల్ పెద్దమొత్తంలో బంగారంతో హైదరాబాదులోని ఎయిర్‌పోర్టులోని దిగిన అనంతరం సమీప బంధువైన ఎనగంటి గ్రామానికి చెందిన ఏనుగుల నాగరాజును కలవగా, సదరు బంగారాన్ని నాగరాజు తీసుకుని కనిపించకుండా పోవడంతో రాంప్రసాద్ వేములవాడ పోలీసులను ఆశ్రయించారు. ఈమేరకు కేసు నమోదు చేసి విచారణ జరిపిన పోలీసులు బంగారం స్వాహా చేశారన్న నేరంపై తొంటి బీరయ్య, గడ్డం అనిల్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో ఏ1 నిందితుడుగా ఉన్న కాల్వ వెంకటేష్ సౌదీలో ఇప్పటికే ఉండగా, ఎ4గా ఉన్న నిందితుడు ఏనుగుల నాగరాజు చాకచక్యంగా పోలీసుల కన్నుకప్పి గల్ఫ్ పారిపోయినట్లు తెలిసింది. మాయమైన బంగారం ఆచూకీ కనుగొనేందుకు ఇద్దరు ఎస్ఐలతో పాటు నలుగురు కానిస్టేబుళ్లతో రెండు బృందాలను పోలీసు అధికారులు ఏర్పాటు చేశారు. శంషాబాద్ విమానాశ్రయం వద్ద స్వాధీనం చేసుకున్న బంగారాన్ని నాగరాజు ఏం చేశాడనే విషయంపై ఇంకా స్పష్టత రాకపోవడం పోలీసు అధికారులను కలవరపరుస్తోంది. నిందితుడు నాగరాజు వాడిన సెల్‌ఫోన్‌కు సంబంధించిన డేటాను సేకరించిన పోలీసులు అందులో లభించిన సమాచారం ఆధారంగా బంగారం రవాణా వ్యవహారంలో ఎవరెవరికి సంబంధాలు ఉన్నాయనే కోణంలో దర్యాప్తు ముమ్మరం చేశారు. కేసు విచారణ తొలి దశలోనే తమ కళ్లుగప్పి చాకచక్యంగా పారిపోయిన నాగరాజును తిరిగి రప్పించేందుకు పోలీసులు లుకౌట్ నోటీస్ జారీచేయనున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా తాను సౌదీ నుంచి 400 గ్రాముల బంగారం తెప్పించుకునేందుకు 35 లక్షల రూపాయలను చెల్లించినట్లు ఫిర్యాదుదారు రవీందర్ చెబుతుండడంపై కూడా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. 400గ్రాములు బంగారం కోసం 35 లక్షల రూపాయలు చెల్లించి విదేశాల నుంచి తెప్పించుకోవాల్సిన అవసరం ఏముంది అనే ప్రశ్నలు కూడా ఉత్తమవుతున్నాయి. పెద్ద మొత్తంలో బంగారం అక్రమ రవాణా జరిగి ఉంటుందని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సౌదీ నుంచి బంగారం తీసుకువచ్చిన బీరయ్య, అనిల్ సైతం తాము చాలా పెద్దమొత్తంలో బంగారం తీసుకువచ్చినట్లు సన్నిహితుల వద్ద చెప్పినట్లు ప్రచారం సాగుతోంది. దీంతో అసలు ఈ బంగారం రవాణా వ్యవహారం ఏ స్థాయిలో సాగి ఉంటుందనేది తేలాల్సి ఉంది.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరి బలవన్మరణం

కొడిమ్యాల, ఏప్రిల్7 (ఆంధ్రజ్యోతి) : కొడిమ్యాల మండల కేంద్రానికి చెందిన రాచర్ల ప్రకాష్(54) ఆర్థిక ఇబ్బందులతో ఆదివారం రాత్రి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు కొడిమ్యాల ఎస్సై ఎస్.సందీప్ తెలిపారు. ప్రకాష్ వద్ద పలువురు అప్పుగా తీసుకొని తిరిగి ఇవ్వకపోవటంతో ఇబ్బందుల పాలయ్యాడు. ఇంటి యజమాని తరుచుగా ఇంటిని ఖాళీ చేయాలని గొడవ పెట్టాడన్నారు. ఇంటి యజమానితో ఆదివారం రాత్రి గొడవ జరగటంతో అద్దెకు ఉంటున్న ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి భార్య రాధ ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రాజన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు

● కోడెమొక్కులు చెల్లించుకున్న భక్తులు



రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

వేములవాడ కల్చరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి ఆలయానికి సోమవారం భక్తులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి వేములవాడకు తరలివచ్చిన భక్తులు సోమవారం తెల్లవారు జామునే ఆలయ కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకుని ధర్మగుండంలో పవిత్ర స్నానాలను ఆచరించారు. ధర్మదర్శనం, శీఘ్రదర్శనం, బ్రేక్‌దర్శనం క్యూలైన్‌ల ద్వారా భక్తులు ఆలయంలోకి చేరుకుని శ్రీపార్వతిరాజరాజేశ్వర స్వామి వారలను దర్శించుకున్నారు. రాజన్నకు అత్యంత ప్రీతిపాత్రమైన కోడెమొక్కును చెల్లించుకునేందుకు భక్తులు గంటల తరబడి క్యూలైన్‌లో నిరీక్షించారు. ఆలయంలోకి ప్రవేశించిన భక్తులు రాజన్నకు కోడెమొక్కు చెల్లించుకున్నారు. అనంతరం అనుబంధ ఆలయాల్లో కుంకుమ పూజలో పాల్గొన్నారు. బద్దిపోచమ్మ అమ్మవారికి బోనం తీసి డప్పుచప్పుళ్లు, శివసత్తుల నృత్యాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి పిల్లాపాపలు చల్లంగా ఉండాలని వేడుకున్నారు.

ఈవో వినోద్‌రెడ్డికి ఆలయ ఉద్యోగుల సన్మానం..

వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో శ్రీరామనవమి నవరాత్రోత్సవాలు ఘనంగా నిర్వహించిన సందర్భంగా ఆలయ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఈవో వినోద్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు శ్రావణ్‌కుమార్, అశోక్‌కుమార్, జయకుమారి, సూపరింటెండెంట్‌లు వరి నర్సయ్య, శ్రీకాంత్, సీనియర్ అసిస్టెంట్‌లు మమత, పురాణం వంశీ, బొడుసు మహేష్, లతదేవి, ప్రధాన అర్చకులు మామిడిపల్లి రాములు, చంద్రగిరి శరత్, గోపన్నగారి రఘు, గౌతమ్, కూరగాయాల శ్రీనివాస్, సుశీల్ తదితరులు ఉన్నారు.



ఈవో వినోద్‌రెడ్డిని సన్మానిస్తున్న భక్తులు



బద్దిపోచమ్మ వద్దకు బోనాలతో వెళుతున్న భక్తులు

గుండెపోటుతో దుబాయిలో అయిలాపూర్ వాసి మృతి



శ్రీనివాస్ గౌడ్ (ఫైల్)

కోరుట్లరూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): దుబాయిలో గుండెపోటుతో సోమవారం కోరుట్లరూరల్ మండలం అయిలాపూర్ గ్రామానికిచెందిన గాజర్ల శ్రీనివాస్‌గౌడ్(55) మృతిచెం దాడు. ఐదుసంవత్సరాల క్రితం శ్రీనివాస్‌గౌడ్ ఉపాధి నిమిత్తం అప్పుచేసి గల్ఫ్‌దేశానికి వెళ్లాడు. సోమవారం ఉదయం గుండెపోటుతో శ్రీనివాస్‌గౌడ్ తను ఉంటున్న రూంలో మృతిచెందినట్లు అతడి స్నేహితులు బంధువులకు ఫోన్‌ద్వారా సమాచారం అందించారు. శ్రీనివాస్‌గౌడ్‌కు భార్య జల, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. శ్రీనివాస్‌గౌడ్ మృతదేహం త్వరగా ఇంటికి చేరేలా కేంద్రప్రభుత్వం చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

స్థల పరిశీలనలోనే కేజీబీవీ

● గన్నేరువరంలో స్కూల్ ఏర్పాటయ్యేనా?

● ఈ సంవత్సరమైనా ప్రారంభించాలని కోరుతున్న ప్రజలు

గన్నేరువరం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండలానికి కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల మంజూరై ఏడాదిదాటినా పాఠశాల ఏర్పాటుపై స్పష్టత కొరవడింది. ఏడాది క్రితం మండల కేంద్రంలో కేజీబీవీ ఏర్పాటు కోసం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, అధికారులు, నాయకులతో కలిసి ప్రభుత్వ స్థలాలను, ప్రైవేట్ బిల్డింగ్‌లను పరిశీలించారు. అనుకూలంగా ఎక్కడా భవనం దొరకకపోవడంతో తిమ్మాపూర్‌లోనే కేజీబీవీని ప్రస్తుతానికి కొనసాగిస్తున్నారు. మండల కేంద్రంలో ఏర్పాటుచేసే కేజీబీవీ పాఠశాలలో ఉద్యోగాల కోసం ఇటీవల అవుట్ సోర్సింగ్ ద్వారా అటెండర్, వాచ్‌ఉమెన్, హెడ్‌కుక్, అసిస్టెంట్ కుక్, స్వీపర్ వంటి మొత్తం ఏడుఉద్యోగాలకు దరఖాస్తులను తీసుకున్నారు. దీంతో మండల కేంద్రంలో త్వరలోనే కేజీబీవీ ఏర్పాటు అవుతుందని మండల ప్రజలు భావించారు. ఈ విద్యాసంవత్సరం ముగుస్తున్నందున రాబోయే 2025-26విద్యా సంవత్సరానికైనా కేజీబీవీ పాఠశాలను మండలకేంద్రంలో ఏర్పాటుచేయాలని మండల ప్రజలు కోరుతున్నారు. దీనిపై ఎంఈవో కెరామయ్యను ఆంధ్రజ్యోతి సంప్రదించగా కేజీబీవీ పాఠశాలను మండలంలో ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వ, ప్రైవేట్ భవనాలు అనుకూలంగా లేవు. దీంతో తిమ్మాపూర్‌లోనే కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా మండల కేంద్రంలో పాఠశాలకు అనువైన ప్రభుత్వ స్థలాన్ని సేకరించి నివేదిక ఇవ్వవలసిందిగా తహసీల్దారును ఆదేశించినట్లు తెలిపారు. దీంతో తహసీల్దారు ఇప్ప నరేందర్‌ను ఆంధ్రజ్యోతి సంప్రదించగా మండల కేంద్రంలోని మైలారం రోడ్డుకు ఏనె ప్రాంతంలో 5ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కేజీబీవీ పాఠశాల కోసం సేకరించామని, విద్యాశాఖకు ఈ భూమిని అప్పగించేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.



గన్నేరువరంలో కేజీబీవీ కోసం ప్రభుత్వ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ (ఫైల్)

రుద్రంగిలో విషాదం..

- పుడ్ పాయిజన్‌తో తల్లీ, కొడుకు మృతి
- మృతురాలి ఇంటి ఎదుట బంధువుల ఆందోళన




పుష్పలత, నిహాల్ తేజ్ (ఫైల్)

రుద్రంగి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ఫుడ్‌పాయిజన్‌తో తల్లీకొడుకులు మృతి చెందడంతో మండల కేంద్రంలో విషాదం నెలకొంది. మండలకేంద్రానికి చెందిన కాదాసు పుష్పలత(35), ఆమె కూమారుడు నిహాల్ తేజ్(6) ఈనెల4న రాత్రి చపాతీలు తిన్నారు. అదేరాత్రి ముందుగా నిహాల్‌కు, గంటవ్యవధిలోనే పుష్పలతకు వాంతులు కాగాస్థానికంగా చికిత్స అందించారు. మరుసటి రోజు ఉదయం నిహాల్‌కు ఫిట్స్ రావడంతో చికిత్స కోసం తల్లీకొడుకులను కోరుట్లలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో జగిత్యాల, అక్కడి నుంచి కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా పుష్పలత ఆదివారం రాత్రి మృతిచెందింది. మెరుగైన వైద్య కోసం బాలుడు నిహాల్ తేజ్‌ను వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా సోమవారం తెల్లవారుజామున నిహాల్ తేజ్ మృతిచెందాడు. మృతురాలి భర్త జీవనోపాధి కోసం గల్ఫ్ వెళ్లాడు. తన చెల్లె, మేనల్లుడి మృతిపై అనుమానం ఉందంటూ పుష్పలత అన్న పాలెం శ్రీనివాస్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రుద్రంగి ఎస్‌ఐ ఎస్ అశోక్ తెలిపారు. కాగా, తల్లీకుమారుడి మృతిపై గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తుగా బందోబస్తు ఏర్పాటుచేశారు. కాగా, రుద్రంగి మండల కేంద్రంలో తల్లీకొడుకులు అనుమానాస్పదంగా మృతిచెందారని మృతురాలు అత్తమామ ఇంటి వద్ద పుష్పలత బంధువులు ఆందోళనకు దిగారు. పుష్పలత, నిహాల్‌తేజ్ ఫుడ్‌పాయిజన్ వల్ల చనిపోలేదని ఆందోళన చేపట్టగా, అక్కడికి చెరుకున్న సీఐ వేంకటేశ్వర్లు, ఎస్‌ఐ సిరిసిల్లఅశోక్ మృతురాలి బంధువులతో మాట్లాడి న్యాయం చేస్తామాని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం సింగారం గ్రామ శివారులోని దర్మవాలీ గుట్ట ప్రాంతంలోని పేకాట స్థావరంపై ఎస్‌ఐ రమాకాంత్ ఆధ్వర్యంలోని పోలీసులు సోమవారం దాడులు నిర్వహించారు. ఖచ్చితమైన సమాచారంతో దాడి చేయడంతో గమనించిన ఐదుగురు పేకాటరాయుళ్లు పారిపోయారు. మరో ఇద్దరిని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించామని ఎస్‌ఐ రమాకాంత్ పేర్కొన్నారు. వారి వద్ద నుంచి రూ.4200 నగదు, ఒక సెల్‌ఫోను, బైక్‌ను స్వాధీనపర్చుకున్నామని తెలిపారు. పారిపోయిన ఐదుగురు వ్యక్తులపై ఆరా తీస్తున్నామని పేర్కొన్నారు. కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రమాకాంత్ వివరించారు.

సంపూర్ణ ఆరోగ్యానికి చిరు ధాన్యాలు



- పాత సంప్రదాయం తిరిగి వస్తోంది
- తృణధాన్యాలపై పెరుగుతున్న ఆసక్తి

చొప్పదండి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రజలు పాత రోజుల్లో వరి(బియ్యం)కి బదులుగా జొన్నలు, రాగులు, కొర్రలు, సజ్జలు, వరిగెలు, గుమ్మడి గింజలను ఆహారంగా తీసుకునేవారు. వర్షాభావ పరిస్థితుల్లో కూడా ఇవి బాగా పండేవి. పండుగల సందర్భంలోనే ఇళ్లలో బియ్యంతో అన్నాన్ని వండుకునే వారు. జొన్నరొట్టె వాడకం బాగా ఉండేది. జనాభా పెరుగుదల పాటు సేద్యం పెరగడంతో వరిధాన్యం ఉత్పత్తి పెరిగింది. పాత రుచులైన రాగులు, సజ్జలు, జొన్నల వినియోగం తగ్గి బియ్యంతో చేసిన అన్నం వినియోగం పెరిగింది. ఫాస్ట్‌గా ఫాస్ట్ ఫుడ్ కల్చర్ వచ్చింది. దీనితో ప్రజల ఆరోగ్యం దెబ్బతిన్నది. చిన్న వయస్సులోనే బీపీ, షుగర్ రావడం ప్రారంభమైంది. దీంతో ప్రజలు పాత రుచుల వైపు మొగ్గు చూపుతున్నారు. రాగి సంకటి, జొన్నరొట్టె, సజ్జ రొట్టె, కొర్రలు, అరిగెలు, అండుకొర్రల వినియోగం బాగా పెరిగిపోయింది.

మారుతున్న జీవన విధానం

ఎప్పుడైతే తృణదాన్యాల వినియోగం తగ్గిందో, అన్నం వాడకం పెరిగిందో అప్పటినుంచి మనిషికి రోగాలు పెరిగిపోయాయి. తృణ ధాన్యాలు వాడిన రోజుల్లో మనిషి కాయకష్టం చేసేవారు. అప్పుడే సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేవాడు. మనిషి కూర్చున్న చోటునుంచి లేవకుండా పని చేసే వెసులుబాటు రాగా శారీరక శ్రమ తగ్గి రోగాలు పుట్టుకొస్తున్నాయి.

పాశ్చాత్య దేశాల అలవాట్లను ఆకళింపు చేసుకొని ఫాస్ట్‌ఫుడ్ మోజులో పడి మన ప్రాచీన పద్ధతులను అటుకెక్కించిన సందర్భం నుంచి తిరిగి వేగంగా జీవన విధానం మారుతోంది. ప్రస్తుతం కొర్రలు, జొన్న గడక, రాగి సంకటి, పచ్చ, తెల్లజొన్న రొట్టెలు, సజ్జ రొట్టెల వినియోగం బాగా పెరిగింది. ఫాస్ట్‌ఫుడ్ కల్చర్ నుంచి చాలామంది బయటకు వస్తూ జీవన విధానాన్ని మార్చుకుంటు న్నారు. రాగులు, జొన్నలు తిన్న రోజుల్లో మధుమేహం, బీపీలు ఉండేవి కావు. చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాలనే లక్ష్యంతో కేంద్రప్రభుత్వం 2023-24సంవత్సరాన్ని యాఇయర్ ఆఫ్ మిల్లెట్స్‌గా ప్రకటించింది. మిల్లెట్ సాగుకు పలు ప్రోత్సాహకాలను ప్రకటించి సాగును పెంచేందుకు కృషిచేస్తోంది. ప్రస్తుతం టిఫిన్ సెంటర్లలోనూ రాగి దోశలు, జావా, మిల్లెట్స్ ఇడ్లీలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.



- **రాగులు..**



రాగులను ఆహారంగా తీసుకోవడం వల్ల శరీరంలో ఉన్న అదనపు కొవ్వు కరుగుతుంది. పిల్లల ఎదుగుదలకు, వయస్సు మళ్లిన వారికి, మహిళలకు ఎముకల పుష్టికి ఉపయోగ పడుతుంది. మధుమేహ రోగులలో చక్కెర స్థాయిని నియంత్రిస్తుంది.

- **జొన్నలు..**



పేదవాడి ఆహారంగా జొన్నలు పేరొందాయి. జొన్నపిండితో చేసిన ఆహారపదార్థాలను తింటే తేలికగా జీర్ణమవుతాయి. జబ్బుబారిన పడినవారు జొన్నలు ఆహారం తీసుకుంటే త్వరగా కోలుకుంటారు.

- **కొర్రలు..**



ప్రపంచవ్యాప్తంగా ఎక్కువగా మంది ఇష్టపడే ఆహారపంటలలో కొర్రలకు ప్రత్యేక స్థానం ఉంది. వీటిలో పోషకాలు, ప్రోటీన్లు ఉంటాయి. గుండెకు రక్తప్రసరణను సక్ర మంగా జరిగేలా చేస్తాయి. శరీరంలో వ్యర్థాల ను బయటకు పంపిస్తాయి. కొర్రల ఆహారం ఎంత తిన్నా బరువు పెరుగుదల ఉండదు.

కాంగ్రెస్ ముసుగులో బీఆర్ఎస్ నేతలు



రేచపల్లిలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జీవన్‌రెడ్డి

సారంగాపూర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పది సంవత్సరాల బీఆర్ఎస్ ప్రభుత్వపాలనలో కాంగ్రెస్‌కార్యకర్తలపై అరాచకాలకు పాల్పడిన బీఆర్ఎస్ నేతలు రాజ్యాధికారం కోసం మరోమారు కాంగ్రెస్ ముసుగులో అరాచకాలకు పాల్పడుతున్నారని మాజీమంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి విమర్శించారు. సోమవారం జగిత్యాలజిల్లా సారంగాపూర్ మండలం రేచపల్లి గ్రామంలో నిర్వహించిన జై బాపు, జైభీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ జగిత్యాల ఎమ్మెల్యే మాకునూరి డాక్టరు సంజయ్ కుమార్‌ను ఉద్దేశించి పరోక్షంగా విమర్శనాస్త్రాలు సంధించారు. రాజ్యాధికారం కోసం కాంగ్రెస్ ముసుగులో వస్తున్న బీఆర్ఎస్ నేతలు బిహార్ కూలీల మాదిరిగా కమీషన్ తీసుకొని వచ్చి వెళ్తుంటారని విమర్శించారు. కాంగ్రెస్‌పార్టీ కోసం, ప్రజల సంక్షేమం కోసంనిరంతరం పోరాడుతానని జీవన్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు ఎవరూ తనకు పదవిలేదని అధైర్యపడొద్దని ఆయన సూచించారు. తన తుదిశ్వాస వరకు ప్రజలసంక్షేమం కోసం ప్రజాక్షేత్రంలోనే ఉంటానని జీవన్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

గణేశ్‌నగర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడిజిల్లాలోని డిగ్రీ ఉత్తీర్ణులైన వెనుకబడిన తరగతుల అభ్యర్థులకు హైదరాబాద్ స్కూల్‌ఆఫ్ బ్యాంకింగ్‌అండ్‌ఫైనాన్స్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ హైదరాబాద్ ద్వారా బ్యాంకింగ్, ఫైనాన్స్‌లో ఉచితశిక్షణ అందించనున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు మంగళవారంలోగా www.tgbcstudycircle.cgg.gov.in లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల12న ఉమ్మడిజిల్లా కేంద్రంలో ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వచ్చినమార్కుల ఆధారంగా 30మందిని ఎంపిక చేయనున్నట్లు, శిక్షణ అనంతరం ప్రైవేట్ బ్యాంకుల్లో ఉపాధి కల్పించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 0878-2268686నంబరులో సంప్రదించాలని సూచించారు.

సిరిసిల్ల నేతన్నల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలి

- కేంద్రహోంశాఖ సహాయ మంత్రి స్పందించాలి
- సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు స్కైలాబ్‌బాబు



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు స్కైలాబ్‌బాబు

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల నేతన్నల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలని సీపీఎం రాష్ట్రకమిటీ సభ్యుడు స్కైలాబ్ బాబు డిమాండ్ చేశారు. సిరిసిల్లలో ప్రభుత్వం తయారుచేయించే చీరలకు సంబంధించి మరమగ్గాల, అనుబంధ రంగాలైన వార్పిన్, వైపని కార్మికులకు మెరుగైన వేతనాలు వచ్చే విధంగా ప్రభుత్వమే కూలి నిర్ణయించి ఇతర సమస్యలు పరిష్కరించాలన్నారు. కరీంనగర్ ఎంపీ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ స్పందించాలన్నారు. సిరిసిల్లలో మరమగ్గాలతోపాటు అనుబంధ రంగాల కార్మికుల కూలి నిర్ణయించి, సమస్యలను పరిష్కరించాలంటూ సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధికసమ్మె 7వ రోజుకు చేరుకుంది. అయినా రాష్ట్ర ప్రభుత్వంతో పాటు జిల్లా అధికారులు స్పందించకపోవడంతో సోమవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో 24గంటల దీక్షలను చేపట్టారు. ముఖ్య అతిథిగా సీపీఎం రాష్ట్రకమిటీ సభ్యులు స్కైలాబ్‌బాబు హాజరై దీక్షలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని సిరిసిల్లలో నేతన్నలు వారం రోజులుగా నిరవధిక సమ్మె చేసున్నా రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం దుర్మార్గమని మండిపడ్డారు. నేతన్నలు చేస్తున్న సమ్మె పోరాటానికి సీపీఎం రాష్ట్ర కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందన్నారు. సిరిసిల్లలో నేతన్నల ఆత్మహత్యల నేపథ్యంలో ఉపాధి కల్పించి మెరుగైన వేతనాలు అందించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళనలు, పోరాటాల ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి బుతుకమ్మ చీరల స్థానంలో మహిళాస్వశక్తి సంఘాల మహిళాలకు సంవత్సరానికి రెండు చీరలను అందించేందుకు ఆర్డర్‌లను ఇచ్చిందన్నారు. యాజమానులకు కూలి నిర్ణయించి కార్మికులకు కూలిని నిర్ణయించకుండా అన్యాయం చేయడం సరైందికాదన్నారు.

ప్రభుత్వం అధికారంలోకి రాకముందు సిరిసిల్లలో నేతన్నలను అన్ని విధాలుగా ఆదుకుంటామని చెప్పి 15 నెలలు అవుతున్నా ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదని, ఇప్పటికైనా ప్రభుత్వంతో పాటు చేనేత జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు స్పందించి సిరిసిల్లలో నేతనల సమస్యలతో పాటు వారి డిమాండ్‌లను పరిష్కరించి సమ్మెను విరమింపజేయాలని కోరారు. స్థానిక కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు సిరిసిల్లలో నేతన్న సమస్యలు కనిపించడంలేదా అని ప్రశ్నించారు. బండి సంజయ్ మత విద్వేషాలు రెచ్చగొట్టడమే తప్ప కార్మికుల సమస్యలు పట్టించుకోరా అని అన్నారు. ఇప్పటికైనా బండి సంజయ్‌కుమార్ కేంద్ర ప్రభుత్వంతో పాటు ప్రధాన మంత్రి నరేంద్రమోదీతో మాట్లాడి వస్త్రపరిశ్రమ అభివృద్ధితో పాటు నేతన్నల ఉపాధి సంక్షేమ కోసం పనిచేయాలని కోరారు.

దీక్షకు బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, బీఎస్పీ పట్టణ అధ్యక్షుడు అరుకాల రమేష్‌లతోపాటు వివిధ ప్రజాసంఘాల నాయకులు సంఘీభావం ప్రకటించారు. ఈ దీక్షల్లో మూషం రమేష్ కోడం రమణ, సిరిమల్ల సత్యం, కుమ్మరికుంట కిషన్, నక్క దేవదాస్, ఎలిగేటి శ్రీనివాస్, గుండు రమేష్, బూట్ల వెంకటేశ్వర్లు, అవధూత హరిదాస్, బాస శ్రీధర్, మేకల బాలరాజు, కస్తూరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఫీజు బకాయిల విడుదలలో ప్రభుత్వ నిర్లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి

భగత్‌నగర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఫీజు బకాయిల విడుదలలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని ఏఐఎస్ఎఫ్ రాష్ట్రఅధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి అన్నారు. సోమవారం నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో సీఎంవద్ద విద్యాశాఖ ఉన్నా ఫీజు బకాయిల విడుదల పట్టించుకోవడం లేదన్నారు. విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటమాడవద్దన్నారు. యూనివర్సిటీల భూములను అమ్మాలని చూస్తే ప్రభుత్వంపై తిరుగుబాటు తప్పదన్నారు. ప్రైవేట్ విద్యా సంస్థలు ముందస్తు అడ్మిషన్లు చేపడితే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ప్రత్యక్ష దాడులు చేస్తామన్నారు ఉస్మానియా యూనివర్సిటీలో అత్యవసర ఆంక్షల ఉత్తర్వులను వెంటనే వెనక్కి తీసుకోవాలన్నారు. వేసవిలో ప్రైవేటు విద్యాసంస్థలు ఇంటర్ తరగతులు నిర్వహిస్తున్నాయని ఆరోపించారు. సమావేశంలో జిల్లాకార్యదర్శి మచ్చ రమేష్, నగర కార్యదర్శి మామిడిపల్లి హేమంత్, నగర నాయకులు పాల్గొన్నారు.

ఎన్టీపీసీలో జెమ్ 2025 వర్క్‌షాప్‌నకు సన్నాహాలు

- బాలికలకు మెడికల్ చెకప్ ప్రక్రియ షురూ

జ్యోతినగర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీపీసీ సీఎస్ఆర్ ఆధ్వర్యంలో యేటా నిర్వహిస్తున్న బాలికా సాధికారతా మిషన్(జెమ్) వర్క్‌షాప్ ఈ ఏడాది నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. దీనిలో భాగంగా సోమవారం జెమ్2025 వర్క్‌షాప్‌లో పాల్గొనే 120 మంది బాలికల ఎంపికకోసం మెడికల్ చెకప్ నిర్వహించారు. నాలుగు మండలాల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన194 మంది బాలికలకు(8వ తరగతి) ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈనెలలో ప్రారంభమయ్యే జెమ్ 2025 వర్క్‌షాప్ 28 రోజులపాటు కొనసాగుతుంది. బాలికలను చదువుతోపాటు వివిధ రంగాలలో ప్రోత్సహించే ఉద్దేశంతో ఎన్టీపీసీ యాజమాన్యం 120 మంది పేద విద్యార్థినులకు జెమ్ వర్క్‌షాప్ ద్వారా శిక్షణనిస్తుంది. 28 రోజులపాటు నిర్వహించే వర్క్‌షాప్‌లో ఇంగ్లీషు, హిందీ వ్యాకరణం, కంప్యూటర్ లిటరసీ, మ్యాథమెటిక్స్ సైన్స్‌తోపాటు, స్కిల్ డెవలప్‌మెంట్, యోగా, డ్యాన్స్, కరాటే, డ్రాయింగ్‌లో శిక్షణ ఇస్తారు. గర్ల్స్ ఎంపవర్‌మెంట్ మిషన్ కార్యక్రమం 2019 నుంచి రామగుండం ఎన్టీపీసీలో యేటా నిర్వహిస్తోంది.



విద్యార్థినికి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

జిల్లెల్ల యువకుడికి ఉత్తమ అవార్డు

- రైతు సమ్మేళనంలో గవర్నర్ చేతుల మీదుగా జ్ఞాపిక అందజేత



అవార్డును అందుకుంటున్న ప్రవీణ్

తంగళ్లపల్లి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): హైదరాబాదులో నిర్వహించిన ప్రకృతి, సేంద్రియ రైతు సమ్మేళనంలో తంగళ్ళపల్లి మండలం జిల్లెల్ల గ్రామానికి చెందిన యువ ఇన్నోవేటర్ కొడుముంజ ప్రవీణ్ ఉత్తమ ఇన్నోవేటివ్ అవార్డును గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ చేతుల మీదుగా అందుకున్నారు. ఈనెల 4న హైదరాబాద్‌లోని ఏకలవ్య గ్రామీణవికాస్ ఫౌండేషన్, పల్లెసృజన ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు సమ్మేళనంలో ఉత్తమ ఇన్నోవేటర్‌గా ప్రశంసపత్రంతోపాటు జ్ఞాపికను అందుకున్నారు. మల్బతోటలో కొమ్మలు కత్తిరించి, మూటకట్టే పరికరాన్ని కొడుముంజ ప్రవీణ్ రూపొందించి పలువురి మన్ననలు పొందాడు. రైతు సమ్మేళనంలో తాను తయారుచేసిన యంత్రాన్ని ప్రదర్శించగా గవర్నర్ పరిశీలించి అభినందించినట్లు ప్రవీణ్‌తెలిపారు. గవర్నర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని జ్ఞాపికను అందుకోవడంతో స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు అభినందించారు.

రోడ్డు ప్రమాద ఘటనపై కేసు నమోదు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో గత నెల 31న జరిగిన రోడ్డు ప్రమాద ఘటనపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రమాకాంత్ సోమవారం రాత్రి తెలిపారు. మండలంలోని బుగ్గరాజేశ్వరతండాకు చెందిన ధరావత్ రమేశ్, అతని అన్న కొడుకు అజ్మీరా రవీందర్‌లు కలిసి తమ ద్విచక్రవాహనంపై మండల కేంద్రం నుంచి స్వగ్రామానికి వెళుతున్న క్రమంలో స్థానిక సాయిబాబా కమాన్ వద్ద కామారెడ్డి- సిరిసిల్ల వైపుకు వెళుతున్న గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్రవాహనంతో అతి వేగంగా ఢీకొట్టినట్లు చెప్పారు. ప్రమాదంలో రమేశ్, రవీందర్‌లు తీవ్ర గాయాలపాలయ్యారని పేర్కొన్నారు. బాధితుడు రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ రమాకాంత్ వివరించారు.

జాతీయస్థాయి హ్యాకథాన్‌లో జ్యోతిష్మతి విద్యార్థులకు ప్రథమ బహుమతి



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు

తిమ్మాపూర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): జ్యోతిష్మతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీఅండ్‌సైన్స్ కళాశాల విద్యార్థులు హైదారబాద్‌లో జరిగిన జాతీయ స్థాయి హ్యాకథాన్‌లో ప్రథమ బహుమతి పొందినట్లు విద్యాసంస్థల చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు తెలిపారు. ఆదివారం హైదారాబాద్‌లో ఎస్ఆర్ఎం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీఅండ్‌సైన్స్, సీవోహెచ్‌వోఆర్‌టి సంయుక్తంగా నిర్వహించిన హ్యాకథాన్‌లో 92జట్లతో పోటీపడిన విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. పంట వ్యాధులను గుర్తించడానికి, స్థిరమైన వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడానికి ప్రాజెక్ట్ ఆల్ క్రాప్ కేర్ అనే ఏఐ ఆధారిత పరిష్కారాన్ని విద్యార్థులు అజిత్(సీఎస్‌ఈ-ఏ)-నాలుగవ సంవత్సరం, అక్షిత్(సీఎస్‌యం ఏ)- 4వ సంవత్సరం, రమేష్ (సీఎస్‌ఈ-డీ) -4వ సంవత్సరం చదువుతున్న విద్యార్థులుకలిసి రూపొందించిన అత్యుత్తమ ప్రదర్శనకుగాను రూ.10వేలనగదు బహమతి, ప్రశంసాపత్రంతోపాటు ఈవెంట్ వారు అందించిన టీ-షర్టులు గెలుపొందినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను అభినందించారు. విద్యార్థుల భవిష్యత్తుకు ఇది బండారు బాట వేస్తుందన్నారు.

గ్రామ పంచాయతీలకు భవనాలు లేక ఇక్కట్లు

- అసంపూర్తిగా భవన నిర్మాణాలు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు



అద్దె ఇంట్లో కొనసాగుతున్న సూరయ్యపల్లి కార్యాలయం

మంథని రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామ పంచాయతీలకు పక్కా భవనాలు లేక పోవడంతో ప్రజలు, అధికారులు ఇబ్బందులకు గురువుతున్నారు. భవన నిర్మాణాలను ప్రారంబించినా పనులు పూర్తి కాకపోవడంతో అసంపూర్తిగానే నిలిచిపోయాయి. మండ లంలోని 34 గ్రామ పంచాయతీల్లో 11 గ్రామ పంచాయతీలకు పక్కా భవనాలు లేకపోవడంతో అద్దె ఇండ్లు, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడి కేంద్రాలు, గోపాల మిత్ర భవనాల్లో కొనసాగిస్తున్నారు. మండలంలోని లక్కెపూర్, సిరిపురం, ఆరెంద, భట్టుపల్లి, బెస్తపల్లి, బిట్టుపల్లి, గద్దలపల్లి, గాజులపల్లి, గుమ్నూనూరు, గుంజపడుగు, కాకర్లపల్లి, సూరయ్యపల్లి, వెంకటాపూర్ గ్రామ పంచాయతీలకు భవనాలు శిథిలావస్థకు చేరడంతో ఉపాధిహామీ పథకంలో కొత్త భవనాలు మంజూరయ్యాయి. కొన్ని భవనాలు 2016-17లో మంజూరు కాగా, మరి కొన్ని 2023లో మంజూరయ్యాయి. అయితే నిధులు రాకపోవడంతో భవన నిర్మాణాల సంబంధిత కాంట్రాక్టర్లు మధ్యలోనే వదిలిపెట్టారు. దీంతో గ్రామ పంచాయతీ కార్యక్రమాలను కొన్ని చోట్ల ప్రైవేట్ ఇండ్లలో నిర్వ హిస్తుండగా అధికారులకు అద్దె భారంపడుతోంది. మరికొన్ని చోట్ల ప్రభుత్వానికి సంబంధించిన ఇతర భవనాల్లో నిర్వహిస్తుండగా సంబంధిత శాఖ వారికి ఇబ్బందిగా ఏర్పడుతుంది. అధికారులు స్పందించి భవన నిర్మాణాలను పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



అసంపూర్తి నిర్మాణంలో గాజులపల్లి పంచాయతీ భవనం

గ్రామ పంచాయతీ భవనాన్ని త్వరగా పూర్తి చేయాలి

కారెంగుల సుధాకర్, మాజీ సర్పంచ్ గాజులపల్లి.



గ్రామంలో ఉన్న పాత భవనాన్ని తొలగించి కొత్త భవన నిర్మాణాన్ని ప్రారంభించాం. అది పూర్తి కాలేదు. భవనం స్లాబ్ వరకు మాత్రమే నిర్మాణం అయింది. గ్రామ పంచాయతీ నిర్వాహణను ప్రభుత్వ పాఠశాల ఆవరణలోని ఒక గదిలో నిర్వ హిస్తున్నారు. దీంతో విద్యార్థులకు, ప్రజలకు ఇబ్బంది ఏర్పడుతోంది. త్వరగా భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలి.

● న్యూస్‌బాక్స్

చలివేంద్రం ప్రారంభం

భగత్‌నగర్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): నగరంలోని అశోక్‌నగర్ బొమ్మ వెంకన్న చౌరస్తా, నాకా చౌరస్తాలో గొట్టిముక్కుల అనసూయసత్యనారాయణ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు గొట్టిముక్కుల ఉమారాణి వెంకటరమణ, వంగల పవన్, దురిశెట్టి అనూప్, దుబాల శ్రీనివాస్, తణుకు సాయి, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఎదుట హాజరైన మున్సిపల్ కమిషనర్

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ కమిషనర్ చాహత్‌బాజ్‌పాయ్ సోమవారం హైదరాబాద్‌లోని ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఎదుట హాజరయ్యారు. గెట్ అవుట్ అంటూ తనపై దురుసుగా వ్యవహరించి అవమానపరిచారని ఆరోపిస్తూ మాజీ కార్పొరేటర్ మెండి చంద్రశేఖర్ కలెక్టర్‌తోపాటు ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై కలెక్టర్ కూడా విచారణ జరిపించారు. ఈ నేపథ్యంలో ఎస్సీ ఎస్టీ కమిషన్ ఎదుట హాజరుకావాలంటూ కమిషనర్ చాహత్‌బాజ్‌పాయ్, ఫిర్యాదు దారుడు మెండి చంద్రశేఖర్, ఆయన భార్య మెండి శ్రీలతకు నోటీసు ఇవ్వడంతో సోమవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇరువురి వాదనలు విన్న కమిషన్ ఛైర్మన్ వారి మధ్య సయోధ్య కుదుర్చి వివాదానికి తెరదించినట్లు చంద్రశేఖర్ తెలిపారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీకి సన్మానం

భగత్‌నగర్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డిని బీజేపీ నాయకులు సోమవారం సన్మానించారు. ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయం జరిగిన సమావేశంలో కలిశారు. ఈ కార్యక్రమంలో నరహరి లక్ష్మారెడ్డి, బండారి శ్రీనివాస్, కర్ర ప్రభాకర్ రెడ్డి, బొంగోని పర్శరాములు పాల్గొన్నారు.

గ్రూప్-1 ర్యాంకర్ శివకుమార్‌కు సన్మానం

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మంకమ్మతోటకు చెందిన గ్రూప్-1 ర్యాంకర్ బత్తుల శివకుమార్‌ను మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో సోమవారం సన్మానించారు. బత్తుల రవీందర్, కరుణ దంపతులకు అభినందనలు తెలిపారు. మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు ముప్పిడి సునీల్, ప్రతినిధులు గుర్రాల వెంకటరమణ, బేతి అనిల్‌కుమార్, నరాల హరికృష్ణ, జక్కుల మధు పాల్గొన్నారు.

తల్లీబిడ్డల ఆరోగ్యం అందరి బాధ్యత

● జిల్లా వైద్యాధికారి వెంకటరమణ ● ప్రపంచ ఆరోగ్య దినోత్సవం



ర్యాలీ ప్రారంభిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ వెంకట రమణ

సుభాష్‌నగర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): తల్లీబిడ్డల ఆరోగ్యంపై ప్రభుత్వం, ప్రజలు బాధ్యత వహించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకట రమణ అన్నారు. సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఏటా ఏప్రిల్ 7వ తేదీన ఒక్కో థీమ్‌తో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు, ఈ సంవత్సరం ఆరోగ్యకర ఆరంభాలు- ఆశ జనత భవితవ్యాలు అనే థీమ్ తీసుకున్నట్లు తెలిపారు. తల్లీబిడ్డల ఆరోగ్యం జీవిత కాలం ప్రభావితం చూపుతుందన్నారు. ప్రస్తుతం దేశంలో మాతృ మరణాల రేట్లు 97, రాష్ట్రంలో 43, శిశు మరణాల రేట్లు దేశంలో 35, రాష్ట్రంలో 21గా ఉన్నాయని, వాటిని తగ్గించవచ్చని అన్నారు. జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ సుధ, డాక్టర్ ఉమాశ్రీ, వైద్యులు పాల్గొన్నారు.

కరీంనగర్ రూరల్: ఆరోగ్య దినోత్సవం సందర్భంగా కరీంనగర్ మండలం బొమ్మకల్‌లోని చల్మెడ ఆనందరావు వైద్య కళాశాల విద్యార్థులు సోమవారం దుర్శేడ్‌లో అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అసీమ్ అలీ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు ఆహార నియమాలు, శారీరక శ్రమపై దృష్టి సారించాలని సూచించారు. కళాశాల హెచ్‌ఓడీ డాక్టర్ రాజమౌళి పాల్గొన్నారు.

గణేశ్‌నగర్: ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జీవశాస్త్రం విభాగం ఆధ్వర్యంలో ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. అకడమిక్ కోఆర్డినేటర్, జీవశాస్త్ర విభాగాధిపతి మనోజ్ కుమార్ పాల్గొన్నారు.

కరీంనగర్ రూరల్: నగునూర్‌లో తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల కళాశాలలో కళాశాల విద్యాధికారి డాక్టర్ చైతన్య విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ మాలతి, వైస్ ప్రిన్సిపాల్ సమత తదితరులు పాల్గొన్నారు.

సుభాష్‌నగర్: నగరంలోని మెడికవర్ ఆస్పత్రిలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆస్పత్రి సెంటర్ హెడ్ కిరణ్ పాల్గొన్నారు.

హుజూరాబాద్ లీగల్: లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో హుజూరాబాద్ కోర్టు ఆవరణలో ఉచిత వైద్యశిబిరం, న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. సబ్‌జడ్జి పీటీ కిరణ్‌కుమార్, న్యాయమూర్తులు స్వాతి, పద్మసాయిశ్రీ, వైద్యులు చందు, మధుకర్, శశాంక్ జరీనా పాల్గొన్నారు.

రామడుగు: బీఆర్‌ఎస్ యూత్ మండల ఉపాధ్యక్షుడు బుదారపు కార్తీక్ ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాల్‌రావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులను ఘనంగా సన్మానించారు. వైద్యాధికారి వెంకట గ్రీష్మన్య, వెంకటేశ్వర్లు, కొలిపాక కమలాకర్ స్వామి, పురాణం రమేష్, తిరుపతి, నరేందర్, శ్రీధర్, కొము రయ్య, శివశంకర్, నాగరాజు పాల్గొన్నారు.

తిమ్మాపూర్: మండలంలోని ఎల్‌ఎండీకాలనీలో మానసిక వికలాంగుల పాఠశాలలో సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా 53మంది పిల్లలకు వైద్యపరీక్షలు నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జి వెంకటేష్ మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మండల వైద్యాధికారి ప్రణవ్, ప్రిన్సిపాల్ సతీష్, ఏవో బాలరాజు, డాక్టర్లు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న చల్మెడ ఆనందరావు వైద్య కళాశాల విద్యార్థులు

రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలి



పాదయాత్రలో సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం అందరికీ సమాన హక్కులు కల్పించిందని, కొన్ని పార్టీల మూర్ఖపు పాలనతో దాన్ని పరిరక్షించుకోవాల్సిన ఆవశ్యకత ఏర్పడిందని సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం రాంనగర్ టెలిఫోన్ క్వార్టర్స్ నుంచి 14, 15, 37, 55, 56, 59, 60 డివిజన్ల మీదుగా ముఖరంపుర జ్యోతిబా పూలే గ్రౌండ్ వరకు జై బాపు, జైభీమ్, జై సంవిధాన్ రాజ్యాంగ పరిరక్షణ యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1995లో మహాత్మా గాంధీ జాతీయ కాంగ్రెస్‌కు అధ్యక్షుడిగా ఉన్నారని, స్వాతంత్ర్యం కోసం ఎన్నో ఉద్యమాలు చేశారని, అది నేటి తరానికి తెలియాలని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ మల్లి కార్జున రాజేందర్, నాయకులు తాజొద్దీన్, తిరుపతి, ప్రభాకర్, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

వీణవంక: మండలంలోని దేశాయ్‌పల్లిలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ ఆధ్వర్యంలో జై బాపు.. జై భీమ్.. జై సంవిధాన్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రణవ్ మాట్లాడుతూ రాజ్యాంగ పరిరక్షణ కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు.

మానకొండూరు/ఇల్లందకుంట/చొప్పదండి : కాంగ్రెస్ చేపట్టిన జైభీమ్, జైబాపు, జై సంవిధాన్ యాత్ర మండలాల్లోని పలు గ్రామాల్లో కొనసాగింది. మానకొండూర్‌లో డీసీసీ ప్రధాన కార్యదర్శి సంపత్‌గౌడ్, మండల అధ్యక్షుడు రవింద్రాచారి, నాయకులు రాజయ్య, దేవేంద్ర, రాములు, రామకృష్ణ, శ్రీకాంత్, ఇల్లందకుంటలో మండల అధ్యక్షుడు పెద్ది కుమార్, సారంగపాణి, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

కేసీఆర్ స్క్రిప్ట్ చదువుతున్న బండి సంజయ్

● సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): బండి వ్యాఖ్యలు చూస్తుంటే కేసీఆర్ రాసి పంపిన స్క్రిప్ట్ చదువుతున్నట్లు ఉందని సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి విమర్శించారు. స్థానిక ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రవర్తన తీరు ఉట్టికి అందనోడు ఆకాశాన్ని అందుకోవాలని చూసినట్లు ఉందని ఎద్దేవా చేశారు. బండి సంజయ్ బీజేపీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు అవసరం లేకున్నా కరీంనగర్ గల్లీలోని పార్టీ కార్యాలయంలో నిరాహార దీక్ష చేపట్టారని, రెండు గంటలకే కేసీఆర్ ప్రభుత్వం గ్యాస్ కట్టర్లతో, ఫైర్ ఇంజన్లతో హంగామా చేసిందని, అదంతా బండికి మైలేజీ రావాలని మ్యాచ్ ఫిక్సింగ్‌తో జరిగినట్టు ఉందని అన్నారు. ఇప్పుడు మళ్లీ బీజేపీ అధ్యక్షుడు కావాలని కేసీఆర్, బండి ఆడుతున్న నాటకంలా ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్‌పై బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యలను ఖండించారు. చిత్త శుద్ధి ఉంటే కేంద్ర ప్రభుత్వంతో బీసీ రిజర్వేషన్లకు అనుమతి ఇప్పించాలని డిమాండ్ చేశారు. బీజేపీలో జాతీయ స్థాయిలో నిర్ణయం లేకుండానే మీకు మంత్రి పదవి వచ్చిందా అని,కాంగ్రెస్ జాతీయ స్థాయిలో తీసుకునే నిర్ణయాలను ప్రశ్నించడానికి మీరెవరని ప్రశ్నించారు. కాంగ్రెస్ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ సింపుల్ సిటీని చూసి నేర్చుకోవాలన్నారు. తాజ్, అరుణ్ కుమార్, శ్రవణ్ నాయక్, పద్మ, రమేష్, సాయిరాం, శ్రీనివాస్ రెడ్డి, మాసుం ఖాన్, బషీర్, భారీ, వాసు తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ అభినందనీయం



మజ్జిగ అందజేస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

సుభాష్ నగర్, ఏప్రిల్7(ఆంధ్రజ్యోతి): వేసవిలో ప్రజావాణికి వచ్చే వారికి ఉచితంగా మజ్జిగ పంపిణీ అభినందనీయమని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. టీఎన్‌జీవో ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మజ్జిగ కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీఎన్‌జీవో సేవా కార్యక్రమాలను కొనియాడారు. టీఎన్ జీవో జిల్లా అధ్యక్షుడు, ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్, టీఎన్‌జీవో కార్యదర్శి సంగెం లక్ష్మణ్‌రావు, కోశాధికారి ముప్పిడి కిరణ్‌కుమార్, టీజీవో జిల్లా అధ్యక్షుడు కాళిచరణ్, కార్యదర్శి డాక్టర్ అరవింద రెడ్డి, కేంద్ర సంఘం నాయకుడు నరసింహస్వామి, రాగి శ్రీనివాస్, గూడ ప్రభాకర్‌రెడ్డి సర్దార్ హర్విందర్ సింగ్, రవీందర్‌రెడ్డి, మారుపాక రాజేష్ భరద్వాజ్, కార్యదర్శి సుమంత్ రావు, నాలుగోతరగతి ఉద్యోగులసంఘం జిల్లా అధ్యక్షుడు రామస్వామి పాల్గొన్నారు.

ఉచిత కుట్టు శిక్షణ శిబిరం పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): నగరలోని అమ్ము స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు, బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర నాయకురాలు సుజాతారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉచిత కుట్టు శిక్షణ శిబిరం పోస్టర్‌ను కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు అవకాశాలను సద్వినియోగం చేసుకొని స్వశక్తితో ఎదగాలన్నారు. స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు సుజాతరెడ్డి మాట్లాడుతూ ఉచిత కుట్టు శిక్షణ శిబిరం వేసవి సెలవుల్లో జ్యోతినగర్‌లోని తమ సంస్థ కార్యాలయంలో ప్రారంభిస్తామని, ఆసక్తి గలవారు 9989455609 నంబరులో సంప్రదించాలని కోరారు. పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు సంజీవరెడ్డి, అజయ్‌వర్మ, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ కానిస్టేబుళ్లకు సన్మానం



సన్మానిస్తున్న ట్రాఫిక్ సీఐ కరీం ఉల్లాఖాన్, పర్శ రమేష్

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఐదుగురు కానిస్టేబుళ్లు పదోన్నతితో బదిలీపై వెళ్తుండడంతో స్టేషన్ ప్రాంగణంలో సోమవారం వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పదోన్నతి పొందిన కాని స్టేబుళ్లలో నెల్లి శ్రీనివాస్, మొహమ్మద్ అలీపాషా, కనకనాల చంద్రారెడ్డి, కుర్ర కనకయ్య, వల్లపు సంపత్‌ను ట్రాఫిక్ సీఐ కరీముల్లా ఖాన్ సన్మానించారు. సీఐ పర్శ రమేష్, ఎస్సై ఇషాక్ అహ్మద్ పాల్గొన్నారు.

ఆల్‌ఇండియా రెడ్డి సంఘం కార్యదర్శిగా మధుసూదన్‌రెడ్డి

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా రెడ్డి సంఘం జిల్లా కార్యదర్శిగా కొత్తపల్లి పట్టణానికి చెందిన వాడ మధుసూదన్‌రెడ్డిని నియమించినట్లు ఆ సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు బీరెడ్డి కరుణాకర్‌రెడ్డి సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని రెడ్డి కులస్థులను ఏకం చేసేందుకు గ్రామాల్లోని సంఘం ప్రతినిధులతో కలిసి పనిచేస్తానని పేర్కొన్నారు.

రోడ్డు పక్కనున్న బావులను పూడ్చివేయాలి



రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉన్న బావిని చూపిస్తున్న ఉదయ్‌కుమార్

గన్నేరువరం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గునుకుల కొండాపూర్ గ్రామసమీపంలో రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉన్న రెండు వ్యవసాయ బావులను వెంటనే పూడ్చివేయాలని యువజన నాయకుడు సంపతి ఉదయ్‌కుమార్ సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. రోడ్డు వెంబడి ఎలాంటి రక్షణ గోడలు లేకుండా ప్రమాదకరంగా ఉన్న బావులతో వాహనదారులకు, బాటసారులకు, పశువులకు ప్రమాదం పొంచి ఉన్నదన్నారు. వెంటనే అధికారులు స్పందించి రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉన్న బావులను పూడ్చివేయాలని డిమాండ్ చేశారు.

రెడ్డిపల్లిలో అంగన్‌వాడీ పిల్లల ప్రీస్కూల్ మేళా

వీణవంక, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ-1 కేంద్రంలో సోమవారం ప్రీస్కూల్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రైమరీస్కూల్ హెచ్‌ఎం పద్మ, పంచాయతీ కార్యదర్శి రాజేందర్ మాట్లాడుతూ అంగన్‌వాడీకేంద్రాలు ప్రీస్కూల్ పిల్లలకు వరాలుగా మారాయన్నారు. అంగన్‌వాడీకేంద్రాల్లో గర్భిణులకు, బాలింతలకు, ప్రీస్కూల్ పిల్లలకు పాలు, బాలామృతం, గుడ్లు, సంపూర్ణ పౌష్టికాహారంతో కూడిన భోజనాన్ని అందిస్తున్నారన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పిల్లల తల్లిదండ్రులు, లబ్ధిదారులు, గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌కార్డు సర్వేపై మినహాయింపు ఇవ్వాలి

శంకరపట్నం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): వేసవిలో రేషన్‌కార్డు సర్వేపై మినహాయింపు ఇవ్వాలని మండల పంచాయతీ కార్యదర్శులు సోమవారం ఎంపీడీవో కృష్ణప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవికాలం దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడడం, ఉపాధిహామీ పనుల నిర్వహణ, ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసం దరఖాస్తులు, ఇంటి పన్నుల వసూళ్ల పనులు ఉండడం వలన సర్వేపై మినహాయింపు ఇవ్వాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

గంగాధర, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలంలో ఖాళీగా ఉన్న రేషన్ డీలర్ల నియామకానికి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ అనుపమ తెలిపారు. ఈసందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాల్లో భర్తీ చేయనున్న డీలర్ల ఖాళీలను ప్రకటించారు. సర్వారెడ్డిపల్లి(జనరల్), ర్యాలపల్లి(ఎస్సీ మహిళ), ఉప్పరమల్యాలలో రెండు ఖాళీఉండగా ఒకటి జనరల్, బీసీ మహిళ, తాడిజెర్రి (జనరల్), నారాయణపూర్(వీహెచ్‌మహిళ)లకు కేటాయించినట్లు తెలిపారు. పదవ తరగతి ఆపై ఉత్తీర్ణులైన అర్హులైన అభ్యర్థులు ఈనెల 12 వరకు కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు ఫారాలు తహసీల్దార్ కార్యాలయంలో లభిస్తాయని ఆమె తెలిపారు.

పేదలకు అండగా ప్రభుత్వం

● నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్

హుజూరాబాద్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అండగా ఉంటుందని హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ వొడితెల ప్రణవ్ అన్నారు. సోమవారం హుజూరాబాద్ పరిధిలోని ఇందిరానగర్‌లో లబ్ధిదారుడు శ్రీనివాస్ ఇంట్లో ఆయన భోజనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పథకం ప్రవేశపెట్టిన వారం రోజుల్లోపే 95శాతం మంది సన్నబియ్యం తీసుకున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నంత వరకు ఉచిత సన్నబియ్యం కొనసాగుతుందన్నారు.



లబ్ధిదారుడి ఇంట్లో భోజనం చేస్తున్న వొడితెల ప్రణవ్

టీబీ బాధితులకు న్యూట్రిషన్ కిట్లు అందజేత

శంకరపట్నం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో టీబీ రోగులకు న్యూట్రీషియన్ కిట్లను సోమవారం మండల వైద్యాధికారి డాక్టర్ శ్రావణ్‌కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా ప్రతి నెల మండల కేంద్రంలో 15మంది టీబీ రోగులు వైద్యం పొందుతున్నారన్నారు. పౌష్టికాహార కిట్లు వ్యాధిగ్రస్తుల్లో రోగనిరోధక శక్తిని పెంపొందించి వారు త్వరగా వ్యాధినుంచి కోలుకునేందుకు ఉపయోగపడుతాయన్నారు. అంతేకాకుండా వారి బ్యాంకుఖాతాలో ప్రతినెల రూ.వెయ్యి జమ అవుతున్నట్లు తెలిపారు.

ఘనంగా జీవీఆర్ జన్మదిన వేడుకలు



జీవీఆర్‌ను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

మానకొండూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, సుడా మాజీచైర్మన్ జీవీ రామకృష్ణారావు జన్మదిన వేడుకలను మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు తాళ్లపల్లి శేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మాజీఎమ్మెల్యే రసమయి బాలకిషన్ హాజరై కేక్‌కట్ చేయించి జీవీఆర్‌ను సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన అభిమానులు గజమాలతో సత్కరించి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ నల్ల గోవిందరెడ్డి, కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి, అడప శ్రీనివాస్, రామంచ గోపాల్‌రెడ్డి, గుర్రం కిరణ్, పిట్టల మధు, శేఖర్, సతీష్ పాల్గొన్నారు.

గన్నేరువరం: గన్నేరువరంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంపవెంకన్న ఆధ్వర్యంలో కేక్‌కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. నాయకులు పుల్లెల లక్ష్మణ్, బద్దం తిరుపతిరెడ్డి, సమ్మెట అనిల్, తదితరులు పాల్గొన్నారు.

లింకు రోడ్డు నిర్మాణం పూర్తయ్యేదెన్నడు?

హుజూరాబాద్‌రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాట్రపల్లి గ్రామం నుంచి దమ్మక్కపేట గ్రామానికివెళ్లే లింకు రోడ్డు పూర్తయ్యేదెన్నడని గ్రామస్థులు పేర్కొంటున్నారు. రోడ్డు నిర్మాణానికి సర్వే పూర్తయినా నిర్మించడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 15సంవత్సరాల క్రితం రోడ్డు సర్వేపనులు నిర్వహించారు. రోడ్డు నిర్మాణం కోసం మట్టిపనులు సైతం పూర్తయ్యాయి. మూడు సంవత్సరాల క్రితం రోడ్డు పనులు చేసేందుకు గుత్తేదారు వచ్చాడు. కానీ దారి మధ్యలో కల్వర్టు నిర్మించాల్సిండగా.. ఇప్పటివరకు ఆ పనులు కార్యరూపం దాల్చలేదు. దీంతో రెండు గ్రామాల మధ్య రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే లింకురోడ్డు పనులు పూర్తయ్యేలా చూడాలని కోరుతున్నారు.



కాట్రపల్లి-దమ్మక్కపేట లింక్‌రోడ్డు

పదోన్నతి పొందిన కానిస్టేబుళ్లకు సన్మానం



చొప్పదండిలో కానిస్టేబుళ్లను సన్మానిస్తున్న సీఐ, సిబ్బంది

చొప్పదండి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్స్‌గా విధులు నిర్వహిస్తున్న పరశురాములు, రవీందర్ హెడ్ కానిస్టేబుళ్లుగా ప్రమోషన్ పొందగా సీఐ ప్రకాశ్‌గౌడ్, ఎస్‌ఐ సురేందర్ సన్మానించారు. పరశురాములు మెదక్‌జిల్లాకు, రవీందర్ కామారెడ్డి జిల్లాకు పదోన్నతిపై బదిలీ అయ్యారు.

ఇల్లందకుంట: ఇల్లందకుంట పోలీస్ స్టేషన్లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న కనుకుంట్ల లక్ష్మణ్ హెడ్‌కానిస్టేబుల్‌గా పదోన్నతిపొంది మెదక్‌జిల్లాకు బదిలీపై వెళ్తున్నాడు. సోమవారం స్టేషన్‌ఎస్‌ఐ రాజకుమార్, సిబ్బంది ఆయనను సన్మానించారు.

హనుమాన్ సేవా కమిటీ

రామడుగు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సోమవారం హనుమాన్ సేవాకమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చిలవరి కనకయ్య, ఉపాధ్యక్షుడిగా కడారి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా సముద్రాల రమేష్, కోశాధికారిగా జవ్వాజి అజయ్, సభ్యులుగా బొజ్జ తిరుపతి, నీలం ప్రశాంత్, జయంత్ ఎన్నికయ్యారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

రామడుగు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగసాయిపల్లి గ్రామంలో సీసీరోడ్డు పనులను బీజేపీ నాయకులు సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో స్టేట్ కౌన్సిల్ మాజీమెంబర్, శక్తి కేంద్రం ఇన్‌చార్జి కట్ట రవీందర్, నాయకులు మునిగంటి శ్రీనివాసాచారి, మండల శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

వీణవంకలో..

వీణవంక, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లస్మక్కపల్లిలో సోమవారం సీసీ రోడ్డు నిర్మాణ పనులను కాంగ్రెస్ నాయకుడు మద్దల ప్రశాంత్ పటేల్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. నాయకులు రాకేష్‌రెడ్డి, శ్రీపతిరెడ్డి, కొండాల్‌రెడ్డి, ఎల్లారెడ్డి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

కరపత్రం ఆవిష్కరణ

హుజూరాబాద్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద మహా త్మాజ్యోతిబాపూలే జయంత్యుత్సవ కరపత్రాన్ని సోమవారం కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈనెల11న జరిగే జ్యోతి బాపూలే జయంతి విజయవంతం చేయాలని కోరారు.

అంబేద్కర్ సంఘం ఎన్నిక

గంగాధర, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండల అంబేద్కర్ సంఘంను సోమవారం ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా గంగాధర ప్రవీన్, ర్యాలపల్లికి చెందిన చంద్రశేఖర్ ప్రధానకార్యదర్శిగా ఎన్నికయ్యారు. పూర్తి మండలకమిటీని మరో నాలుగురోజుల్లో ఏర్పాటు చేయనున్నట్లు నాయకులు తెలిపారు.

సన్నబియ్యంలో పంపిణీలో 5 కిలోలు కేంద్రానివే

ముత్తారం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): సన్న బియ్యం పంపిణీలో కేంద్ర ప్రభుత్వం ఐదు కిలోలు ఇస్తోందని బీజేపీ మండల అధ్యక్షుడు బిరుదు గట్టయ్య ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం కిలో మాత్రమే ఇస్తూ ఆరు కిలోలు ఇస్తున్నట్లు ప్రచారం చేసుకుంటోందని తెలిపారు.